సాక్షి తిరుపతి

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



గరుడ సేవకు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుమల శ్రీవారి గరుడ సేవకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. - IIలో



రాకెట్టు.. అదిరేట్టు

గ్రామీణ క్రీడాకారులు బాల్ బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుంటున్నారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	22
చిత్తూరు	32	21
తిరుమల	29	18
గూడూరు	35	24
నగరి	33	23

న్యూస్‌రీల్

ఎస్వీ గోశాలలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్

తిరుమల: దేశవాళీ గోవుల అభివృద్ధి, జన్యుపరమైన సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో తిరుపతి ఎస్వీ గో సంరక్షణ శాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం తిరుమలలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు, టీటీడీ ఆధ్వర్యంలో రూ.46 కోట్లతో సెంటర్ నెలకొల్పుతున్నామన్నారు. శ్రీవారి సేవలకు నెయ్యి, పాలు సేకరించేందుకు దేశావళి గోవులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. కృత్రిమ గర్భధారణ, పిండ బదిలీ వంటి అధునాతన పునరుత్పత్తి సాంకేతికతలపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ దృష్టి సారిస్తోందని చెప్పారు. సమావేశంలో శ్రీజా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ చైర్‌పర్సన్ శ్రీదేవి, ఏడీడీబీ ఎండీ దేవానంద్, టీటీడీ జేఈఓ సదాభార్గవి, ఎఫ్ఎ అండ్ సీఏఓ బాలాజీ, సీఈ నాగేశ్వర్‌రావు, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి, ఎస్వీ పశు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు సర్జన్‌రావు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 3 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి.సోమవారం అర్ధరాత్రి వరకు 73,859 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,634 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.31 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.


24న కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఖాళీగా ఉన్న 33 కాంట్రాక్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 24వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పోస్టుల కోసం ఇప్పటివరకు 140 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఉదయం 9.30 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని సూచించారు.

హరితశోభితంగా సప్తగిరులు

తిరుమల: శేషాచల అటవీప్రాంతంలో వృక్ష సంపదను పెంపొందించి సప్తగిరులను హరిత శోభితంగా తీర్చిదిద్దుతామని టీటీడీ డీఎఫ్ఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తిరుమల రాంబగీచా-2లోని మీడియా సెంటర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీటీడీ పరిధిలో ఉన్న 6 వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో అరుదైన వృక్ష, జంతు జాతులు ఉన్నాయన్నారు. శ్రీవారి ఆలయ అవసరాలకు 100 హెక్టార్లలో శ్రీగంధం వనం, 10 ఎకరాల విస్తీర్ణంలో పూలతోటలు పెంచుతున్నట్లు చెప్పారు. రెండు ఘాట్ రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్ల మార్గంలో భక్తులకు ఆహ్లాదం పంచేలా వివిధ పూల మొక్కలు పెంచామని తెలిపారు. అలాగే భక్తుల భద్రత దృష్ట్యా ఆపరేషన్ చిరుత కొనసాగిస్తున్నామని, ట్రాప్ కెమెరాలను పకడ్బందీగా ఏర్పాటు చేశామని వివరించారు. సమావేశంలో ఏపీఆర్ఓ కుమారి పి.నీలిమ పాల్గొన్నారు.

21 వరకు రేషన్ పంపిణీ



రాజారఘువీర్

తిరుపతి అర్బన్ : రేషన్ పంపిణీని ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి రాజా రఘువీర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో సర్వర్ పనిచేయకపోవడం వల్ల బియ్యం సరఫరాలో రెండు మూడు రోజులు జాప్యం జరిగిందన్నారు. అందుకే రేషన్ సరుకులను పంపిణీని 17 నుంచి 21వ తేదీ వరకు పెంచినట్లు వెల్లడించారు. కార్డుదారులు వెంటనే సరుకులు తీసుకోవాలని సూచించారు.



సింహ వాహనంపై కొలువైన స్వామివారు



ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతున్న దేవదేవేరులు

నేటి వాహనసేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించనున్నారు.రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు సర్వభూపాల వాహనంపై భక్తులను కటాక్షించనున్నారు.



మహిషాసుర మర్ధిని ఘట్టం

బ్రహ్మోండోత్సవం



ఆహా..
శ్రీవారి
నవరాత్రి
బ్రహ్మోత్సవ వేళ
భువి వైకుంఠంలో అడుగిడిన
వారిదే కదా పుణ్యము..
దేవదేవుని వైభవాన్ని వీక్షించిన
వారిదే కదా భాగ్యము..
యోగ నారసింహుని దర్శించిన
వారి జన్మమే కదా చరితార్థము..
దివ్య తేజస్సుతో అలరారుతున్న
శ్రీమన్నారాయణుని సేవించిన
వారిదే కదా మోక్షము..
ముత్యపు పందిరి నీడలో
కొలువైన మలయప్పస్వామిని
కనులారా కాంచిన వారి
జీవితమే కదా పునీతము..
బ్రహ్మాండనాయకుని
కటాక్షం పొందిన వారిదే కదా
సంబరము.

- వైభవంగా తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- సింహ, ముత్యపు పందిరి వాహనాలపై విహరించిన స్వామివారు
- వైకుంఠనాథుని సేవకు తరలివచ్చిన అశేష భక్తజనులు

తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. మంగళవారం మూడోరోజు ఉదయం స్వామివారు యోగనారసింహుని అలంకారంలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయం వెలుపల కొలువు మండపంలో ఏర్పాటు చేసిన నేతి దీపాల వెలుగులో దేవదేవుడు శ్రీమన్నారాయణుని రూపంలో ఊయలలూగుతూ దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి ముత్యపు పందిరి వాహనంలో బాలకృష్ణునిగా ఉభయ దేవేరీ సమేతంగా ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శనలు అలరించాయి. ఆలయం, పుష్కరిణి, మాడవీధుల్లో తీర్చిదిద్దిన పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. పాపవినాశనం మార్గంలోని పుష్ప, ఫొటో ప్రదర్శనశాలకు విశేష స్పందన లభిస్తోంది. విద్యుద్దీపాలంకరణలో ఆనందనిలయం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. వాహన సేవల్లో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వాహనసేవలో సతీ సమేతంగా టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ వేమిరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి



కళాకారుల ప్రదర్శన



సంప్రదాయ నృత్యం

నమో యోగ నారసింహా



ముత్యపు పందిరి వాహనంపై బాలకృష్ణుడు



సింహ వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

- అంగరంగవైభవంగా తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాలు
- ముత్యపు పందిరిలో బాలకృష్ణుడిగా కల్యాణ వెంకన్న
- ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం ఉదయం స్వామివారు అనంత తేజోమూర్తిగా యోగ నరసింహుని అవతారంలో సింహ వాహనంపై దర్శనమిచ్చారు. మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనం ముందు అశ్వాలు, వృషభాలు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి వాహనసేవ కోలాహలంగా సాగింది. శ్రీవారికి తుమ్మలగుంట భక్తులు సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కనులపండువగా ముత్యపు పందిరి వాహనసేవ

కల్యాణ వెంకన్న మంగళవారం రాత్రి బాలకృష్ణుని అవతారంలో అభయమిచ్చారు. ఉభయదేవేరులతో కలసిన మలయప్ప స్వామి ముత్యపు పందిరిలో నీడలో సేదతీరుతూ భక్తులను ఆశీర్వదించారు. వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆలయ ఈఓ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.



సారె తీసుకువస్తున్న తుమ్మలగుంట వాసులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మి



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు, మహిళలు

వెంకటగిరి చేనేతకు చేయూత



రాష్ట్రపతి అవార్డు గ్రహీత మల్లికార్జున్ నివాసంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న జగీష్ తివారీ మిశ్రా

- ఇండియా టీమ్ కమిటీ ప్రతినిధి జగీష్ తివారీ మిశ్రా

సైదాపురం/వెంకటగిరిరూరల్: వెంకటగిరి చేనేత ఉత్పత్తులకు కేంద్రప్రభుత్వం చేయూతనందిస్తుందని ఇండియా టీమ్ కమిటీ ప్రతినిధి జగీష్ తివారి మిశ్రా తెలిపారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. మిశ్రా మాట్లాడుతూ ఓడీఓపీ-2023 అవార్డు దక్కితే వెంకటగిరి చేనేత ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం వస్తుందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 751 జిల్లాల నుంచి 1,102 రకాల హస్తకళా ఉత్పత్తులపై అందిన ప్రతిపాదనల మేరకు వెంకటగిరి చేనేత వస్త్ర నైపుణ్యాలను పరిశీలించామని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెంకటగిరి చేనేతకు ఓడీఓపీ-2023 అవార్డు లభిస్తే జిల్లా ప్రతిష్ట ఇనుమడిస్తుందన్నారు. ఈ సందర్భంగా కేంద్రం బృందంతో పాటు కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించారు. పట్టణంలోని వారు బంగారుపేటలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు కూనా మల్లికార్జున్, గైరవబత్తిన రమణయ్య నివాసాలకు వెళ్లి చీరల తయారీని అడిగి తెలుసుకున్నారు. రాజ రాజేశ్వరి చేనేత సహకార సంఘాన్ని సందర్శించి పనితీరును ఆరా తీశారు. వెంకటగిరిలోని వస్త్ర వ్యాపారినక్కావెంకటరమణయ్య అండ్ సన్స్ వద్దకు వెళ్లి పట్టు చీరలను పరిశీలించారు. అనంతరం నేత కార్మికులతో మాట్లాడి విధి విధానాలు తెలుసుకున్నారు. వారు తయారు చేసిన డిజైన్లను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్, చేనేత జౌళిశాఖ ఆర్‌డీ రాజారావు, ఏడీ పిచ్చేశ్వరరావు, క్లస్టర్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీదేవి, తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగీష్ తివారి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

వావ్...వెరీ నైస్!

వెంకటగిరి పట్టు చీరలు వెరీ నైస్ అంటూ జగీష్ తివారి మిశ్రా కితాబిచ్చారు. పట్టణంలోని శాలి కాలనీలో టాటా ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన చేనేత చీరల ప్రదర్శనను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమెకు చేనేత కార్మికులు విభిన్న శైలిలో మగ్గంపై నేసిన చీరలను చూపించారు. అందులో శ్రీ వెంకటేశ్వరస్వామి చిత్రంతో తీర్చిదిద్దిన చీరను పరిశీలించి వావ్ అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆరోగ్యకర జీవనానికి 'మిల్లెట్స్'

తిరుపతి సిటీ : ఆరోగ్యకరంగా జీవనం సాగించేందుకు మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకోవాలని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. మంగళవారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మిల్లెట్స్ వార్షికోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మారథాన్, సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధులను నివారించే శక్తి మిల్లెట్స్‌కు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను తమ ఆహారంలో తీసుకోవాలని సూచించారు. యువత మంచి ఆహారపు అలవాట్లు పాటించాలని, ప్రత్యేకించి చిరుధాన్యాలను భుజించాలని కోరారు. ర్యాలీ రామకృష్ణ డీలక్స్ సర్కిల్, టౌన్‌క్లబ్, బాలజీ కాలనీ మీదుగా విద్యాపీఠం వరకు కొనసాగింది. తుడా సెక్రటరీ లక్ష్మి, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రీజనల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డాక్టర్ కేవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ హరిత తదితరులు

చిరుధాన్యాలతో రుగ్మతలకు చెక్

ఆహారంలో నిత్యం చిరుధాన్యాలను తీసుకుంటే శరీర రుగ్మతలకు చెక్ పెట్టవచ్చని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. ర్యాలీ అనంతరం వర్సిటీలో నిర్వహించిన మిల్లెట్స్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాల ఉపయోగాలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముక్తేశ్వరరావు మాట్లాడుతూ మిల్లెట్స్‌పై అవగాహన కల్పించేందుకు బృహత్త కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండర్ పద్మశ్రీ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

అద్భుతం.. ఆయుర్వేద వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ రేణుదీక్షిత్

తిరుమల : సనాతన ఆయుర్వేద వైద్యం ఓ అద్భుతమని, దీని ద్వారా దీర్ఘకాలిక రోగాలను సైతం శాశ్వతంగా నయం చేయవచ్చని ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ రేణు దీక్షిత్ తెలిపారు. మంగళవారం తిరుమల రాంబగీచా-2లోని మీడియా సెంటర్‌లో ఆమె మాట్లాడారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో టీటీడీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఆయుర్వేద వైద్యానికి భక్తుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కల్యాణ వేదిక చెంత ఏర్పాటు చేసిన ఆయుర్వేద ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. వరాహస్వామి అతిథి భవనం పక్కన ప్రత్యేక శిబిరం, సీఆర్ఓ, లేపాక్షి దగ్గర ప్రథమ చికిత్స కేంద్రాలలో ప్రతిరోజు దాదాపు 1000 మంది భక్తులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో మొత్తం 314 రకాల ఫార్ములాలకు ఆయుష్ శాఖ నుంచి అనుమతి లభించిందని, వీటిలో 60 రకాల మందులు మొదటి దశలో ఉత్పత్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. షుగరు, బీపీ లాంటి దీర్ఘకాలిక రోగాలకు సంబంధించి ఆయుర్వేద మందుల ద్వారా నయం చేయడానికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పంచకర్మ చికిత్స విధానం ద్వారా 5 రకాల మలినాలను శరీరం నుంచి తొలగించేందుకు వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు. సమావేశంలో ఏపీఆర్ఓ కుమారి పి.నీలిమ పాల్గొన్నారు.

20 నుంచి పీజీ కళాశాలలకు సెలవులు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలోని పీజీ కళాశాలలకు ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు అకడమిక్ డీన్ అప్పారావు మంగళవారం తెలిపారు. విద్యార్థులు ఈనెల 25 నుంచి తిరిగి కళాశాలలకు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ మేరకు సర్క్యులర్ పంపినట్లు వెల్లడించారు.



క్లుప్తంగా

రేపటి నుంచి మోహన మంత్ర-23

- మూడు రోజుల పాటు ఎంబీయులో వేడుకలు
- 25వేలకు పైగా పాల్గొననున్న విద్యార్థులు

చంద్రగిరి:మండలంలో శ్రీసాయినాథ నగర్‌లోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయు)లో మోహనమంత్ర-2023 కార్యక్రమాన్ని గురువారం నుంచి మూడు రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడానికి వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల నుంచి సుమారు 25వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. గురువారం ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గాదంకి సమీపంలోని వాతావరణ పరిశోధన కేంద్ర నుంచి డాక్టర్ వెంకటరత్నం, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొనున్నట్లు వీసీ నాగరాజా రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు టెక్నో, కళాక్షేత్ర, క్లాస్ మ్యాప్, స్కిట్స్, హర్రర్ హౌస్, టెక్నో హాలిక్ మొదలైనవి కలిపి దాదాపు 20 కార్యక్రమాలు, 19, 20న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో రోజూ సాయంత్రం డీజే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రముఖ డీజే నిర్వాహకురాలు పరోమాజాకి (ముంబై), అలాగే సినీ గాయకుడు హేమచంద్ర తమ కార్యక్రమాలతో ఉర్రూతలూగిస్తారని పేర్కొన్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా : 12మందికి గాయాలు



బోల్తా పడిన బస్సు

పెళ్లకూరు : నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై పెళ్లకూరు వద్ద మంగళవారం వేకువజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 12 మంది గాయపడ్డారు. వివరాలు.. అనకాపల్లె సమీపంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన 23 మంది శ్రీవారి భక్తులు తిరుమలకు బస్సులో బయలుదేరారు. మార్గం మధ్యలో ముందు వెళుతున్న వాహనాన్ని బస్సు అధిగమించబోయి, ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటిన తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంనలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



- మాది తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి. నా పేరు రుతిక. నాన్న రైల్వే ఉద్యోగి. 9వ తరగతి చదువుతున్నాను. 2022లో రాష్ట్ర జట్టులో స్థానం దక్కింది. జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొన్నాను. మా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సంపాదించింది. శిక్షణ పొందుతూ జూనియర్, సీనియర్ పోటీలతో పాటు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించాలన్నదే నా లక్ష్యం.



- మాది చిత్తూరు జిల్లా, నగరి పట్టణం. నా పేరు తేజేష్. 10వ తరగతి చదువుతున్నాను. మా వీధిలోనే నివాసముంటున్న పీడీ గోపి వద్ద బాల్‌బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ తీసుకున్నా. పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో శిక్షణ ఆపేసేవారు. ఇలా శిక్షణ తీసుకుంటూ 2021లో జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యాను. ఆ ఏడాది ఏపీ జట్టు 17 రాష్ట్రాలను ఎదుర్కొని చాంపియన్‌గా నిలిచింది. మళ్లీ ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటున్నాను. స్టార్ ఆఫ్ ఇండియాగా రాణించాలన్నదే నా లక్ష్యం.



క్రీడాకారులతో మంత్రి రోజా (ఫైల్)

రాకెట్టు.. అదిరేట్టు!

సాక్షి ఫోకస్

పట్టుదల ఉంటే సాధించలేనిది లేదన్నారు పెద్దలు. ఆ మాటలను నిజం చేస్తున్నారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన గ్రామీణ విద్యార్థులు. ఇటు చదువులోనే కాదు.. అటు క్రీడల్లోనూ విశేషంగా రాణిస్తున్నారు. ముఖ్యంగా బాల్‌బ్యాడ్మింటన్‌లో రాకెట్‌కన్నా వేగంగా దూసుకుపోతున్నారు. జాతీయ స్థాయిలో సత్తాచాటుతూ పతకాల పంట పండిస్తున్నారు. ఇటు తల్లిదండ్రులకు.. అటు రాష్ట్రానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తున్నారు. గ్రామీణ క్రీడాకుసుమాల విజయ గాథపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్.

- బాల్‌బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల హవా
- జాతీయ స్థాయిలో మెరుపులు
- పతకాల పంట పండిస్తున్న గ్రామీణ కుసుమాలు
- వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

నగరి: క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను క్రీడాకారులు అందిపుచ్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింట్ టోర్నీకి ఎంపకయ్యారు. ఇటీవల నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో పాటు నగరికి చెందిన తేజేష్, తిరుపతికి చెందిన ప్రశాంతి జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈనెల 15 నుంచి ఛత్తీస్‌గడ్, బిలాయ్ బీఎస్పీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించనున్నారు. వీరంతా.. సామాన్య, మధ్య తరగతికి చెందిన వారే కావడం విశేషం. ఒక వైపు చదువుకుంటూ మరోవైపు ఆటల్లో రాణిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

గ్రామస్థాయి నుంచి క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడాశాఖ విప్లవాత్మక చర్యలు చేపడుతోంది. ప్రతిభగల విద్యార్థులను వెలుగులోకి తీసుకురావడానికి జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లను నడుపుతోంది. క్రీడాకారులకు ప్రతిభా అవార్డులను అందిస్తోంది. ఈ క్రమంలోనే జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడ పూర్వవైభవం సంతరించుకుంటోంది. పాఠశాల, కళాశాల స్థాయిలో పొందిన శిక్షణతో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వరుసగా జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు దూసుకుపోతున్నారు.



బాల్‌బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

అదే నా లక్ష్యం



మాది తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, అక్కగారిపేట గ్రామం. 9వ తరగతి చదువుతున్నాను. తండ్రి శివప్రసాద్ ఎలక్ట్రీషియన్. బాల్‌బ్యాడ్మింటన్‌పై మక్కువతో శిక్షణ పొందుతున్నాను. నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాను. జూనియర్, సీఎంకప్ పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ చూపాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే రాణిస్తున్నాను. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టును విజేతగా నిలపాలన్నదే నా లక్ష్యం.

– ఆర్.ప్రశాంతి

ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం



జిల్లా నలుమూలల బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాధన చేస్తున్నారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. పోటీలు ఎక్కువగా నిర్వహిస్తుండడంతో ప్రతిభ చాటే అవకాశం లభిస్తోంది. క్రీడాకారులను ప్రోత్సహించడంలో క్రీడాశాఖ మంత్రి ఆర్కే.రోజా అత్యంత చొరవ చూపుతున్నారు. ఆమె సహకారంతో ఈనెల 22వ తేదీ నుంచి జూనియర్ అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను తొలిసారిగా నగరిలో నిర్వహించనున్నాం.

–బాలాజీ, ప్రధాన కార్యదర్శి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్

మినీ లగేజి వ్యాను బోల్తా



రహదారిపై బోల్తా పడిన మినీ లగేజి వ్యాను

చంద్రగిరి: మినీ లగేజి వ్యాను బోల్తా పడిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి కోట సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. చిత్తూరు నుంచి తిరుపతి వైపు ఫెన్సింగ్ కమ్మీ లోడుతో వస్తున్న మినీ లగేజి వ్యాను కోట సమీపంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పంగా యాలయ్యాయి. అతడిని తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాన్ని తొలగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలందరికీ మంచి జరగాలి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు, అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారిని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా అమ్మవారిని పెద్దిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయనకు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, పట్టువస్త్రాలను అందజేశారు.

గరుడ సేవకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్ : తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవకు విచ్చేసే భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

- వాహనాల పాసులకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు
- 19వ తేదీ ఉదయం 6 గంటల నుంచి తిరుమలకు ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు
- తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపుల అమలు చేస్తున్నాం
- చెర్లోపల్లి నుంచి వచ్చే వాహనాలు జూపార్క్ రోడ్డులోని దేవలోక్ పార్కింగ్ ప్రాంతానికి వెళ్లాలి.
- నంది సర్కిల్ వద్దకు వచ్చిన వాహనాలు అన్నారావు సర్కిల్ మీదుగా ఇస్కాన్ గ్రౌండ్‌కు చేరుకోవాలి.
- టౌన్ క్లబ్ నుంచి వచ్చిన వాహనాలను ఇస్కాన్ గ్రౌండ్, ఎస్వీ మెడికల్ కాలేజ్ గ్రౌండ్, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో పార్కింగ్ చేసుకోవాలి
- అలిపిరి ఓల్డ్ చెక్ పాయింట్ వద్ద కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే పార్కింగ్ ఉంటుంది
- తిరుమలలో వీవీఐపీ పెద్ద బ్యాడ్జెస్ వాహనాలను రాంబగీచ ప్రాంతంలో పార్కింగ్ చేసుకోవాలి
- వీఐపీ చిన్న బ్యాడ్జెస్ వాహనాలను ముల్లగుంట, సప్తగిరి గెస్ట్ హౌస్ పార్కింగ్ ప్రాంతాలు కేటాయించాం
- సాధారణ వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా పార్కింగ్ ప్రాంతాలకు వెళ్లాలి

8 మంది ఎర్రదొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం : ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న 8 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు తెలిపారు. మంగళవారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ స్టేషన్ వద్ద వారు విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని కాజీపేట సెక్షన్ పరిధిలో ఆర్ఐ చిరంజీవికి చెందిన మురళీరెడ్డి టీమ్ కూంబింగ్ చేపట్టిందన్నారు. ఈ క్రమంలో పత్తూరు ఫారెస్ట్ బీట్ వద్ద కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ పట్టుబడినట్టు వెల్లడించారు. వారి నుంచి ఆరు దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులు తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లా పోలూరు తాలూకాకు చెందిన శక్తివేలు చిన్నస్వామి (33), రాజేంద్రన్(28), జమునామత్తూరుకు చెందిన భాస్కర్(22), అజిత్‌కుమార్(25), ప్రవీణ్‌కుమార్(23), వేల్లియన్(41), అనైకట్టు తాలూకాకు చెందిన రాజామణిముత్తు(36), శేఖర్ చిన్నస్వామి(24)గా గుర్తించామన్నారు. ఎస్ఐ రఫీ కేసు విచారించి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

దేశానికే ఆదర్శం ఆరోగ్య సురక్ష



ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

నింద్ర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి అవిర్భవించిన అద్భుత పథకం జగన్నన ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం మండలంలోని నేట్టేరి గ్రామంలో జగన్నన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలందించేందుకు విలేజ్ క్లినిక్, రోగుల వద్దకే వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జగన్నన ఆరోగ్య సురక్షతో పైసా ఖర్చులేకుండా ఖరీదైన వైద్యం ఉచితంగా పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిదన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు రానున్న ఎన్నికల్లో కూడా ఆదిరించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. 88 మందికి కంటి అద్దాలు అందజేశారు. 71మందికి రూ.5లక్షల ఆయష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి మేరి, మండల కన్వీనర్ వేణురాజు, వైద్యాధికారులు కల్యాణి, గౌరి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష..ప్రజలకు సంపూర్ణ రక్ష

- జాయింట్ కలెక్టర్ బాలాజి



వృద్ధురాలికి కళ్లజోడు వేస్తున్న జేసీ బాలాజీ

చంద్రగిరి: జగనన్న ఆరోగ్య శిబిరాలు ప్రజల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షగా నిలుస్తున్నాయని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. మంగళవారం స్థానిక చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో చంద్రగిరి సచివాలయం-2 పరిధిలోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. దీనిని జేసీ సందర్శించారు. ఓపీ నమోదు, కంటి వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్టులు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాల్స్‌ను పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వృద్ధులు, మహిళలకు కళ్లద్దాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఇంటి వద్దకే వైద్యులను పంపించడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, సెక్రటరీ మహేశ్వరయ్య, ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సీఎం కేశవులు, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఐసీడీసీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు ప్రశంసలు



'అయ్యా.. సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పైసా ఇవ్వకుండానే పనులన్నీ అవుతున్నాయి. ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారు. చిరకాల స్వప్నమైన వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించారు. ఎన్నడూ లేని స్థాయిలో వైభవంగా జాతర సంబరాలు జరిపించారు. మా ఇంటి బిడ్డలా మమ్మల్ని ఆదుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ గెలిపించుకుంటాం. వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలుస్తాం' అంటూ గుండూరు ఈశ్వరమ్మ(77) అనే వృద్ధురాలు తన అభిప్రాయం వెలిబుచ్చారు. మంగళవారం వెంకటగిరిలోని బంగారుపేట బీసీ కాలనీలో పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఈశ్వరమ్మ తన మనోభావాన్ని వ్యక్తం చేశారు.

- వెంకటగిరి రూరల్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

ONE SITTING
Direct 10th, Inter one Sitting, B.A, B.Com, B.Sc, BBA, B.Tech, M.A, M.Com, M.Sc, MBA, MCA, Distance Education, Tirupati, 7416478396, 7416478395.

Real Estate
శ్రీకాళహస్తి సమీపంలో 30 ఎకరాల మామిడి తోట పొలం కలదు. ఇందులో 22సెంట్లు రూ 14 లక్షలు మాత్రమే, హామీ ఇవ్వబడిన ప్రకారము 3లివారీ రూ.10,000/-(3సంవత్సరాలు) రాబడిని పొందండి. 80192 77811 కి కాల్ చేయండి.

LAND FOR SALE
మనుబోలు చెర్లోపల్లి దగ్గర 16 ఎకరాల వ్యవసాయ భూమి (సం॥ 3 పంటలు) అమ్మకానికి కలవు. సంప్ర: 9444 444 642

BUSINESS SERVICE

BUSINESS OFFER
కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్, ప్రాపర్టీ, పర్సనల్, అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary + Commission. ఫోన్ : 9990752820

PERSONAL CARE

CHANGE OF NAME
I, Katam Reddy Venu Gopal Reddy S/o. Katamreddy Veera Reddy R/o. Manavali Village, Ozili Mandal, Tirupati District, A.P. 524421. have Changed my name from Katamreddy Venugopal to KATAM REDDY VENU GOPAL REDDY for all purposes

Wanted
Topline Business Support Solutions Pvt. Ltd.తిరుపతి,భారీ స్టీల్ పరిశ్రమ నందు పనిచేయడానికి 2-4సం.ల భారీ పరిశ్రమలో పనిచేసిన అనుభవం ఉండి ITI చదివిన ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్స్ కావలెను. 99893 05114, 8971328914, 8754594321.

ప్రకృతి ఇన్ ఫ్రా లో పనిచేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: రామానుజ సర్కిల్, SBI U/S 2nd ఫ్లోర్, తిరుపతి, 9741163131, 9676329827.

కాల్ సెంటర్‌లో పనిచేయుటకు ఔత్సాహికులైన యువతులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, A: 21-30వరకు,అ:తెలుగు బాషపై పట్టు, టెలిఫోనిక్ మ్యానర్స్, కంప్యూటర్ పరిజ్ఞానం. 9966249187.

Wanted: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారత్ పే కంపెనీ లో పని చేయుటకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 18K to 40K. Cell: 9966097733

వశిష్ట అసోషియేట్ తిరుపతి నందు 10th, ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులు స్త్రీ/పు॥లు అర్జెంట్‌గా కావలెను. జీతం: 20K + Online are Available Cell: 8790139024

ప్రముఖ కంపెనీలో తిరుపతి, పీలేరు ప్రాంతాల్లో పని చేయుటకు టీం లీడర్లు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం + ఇన్సెంటివ్. సంప్రదించండి.8977515555,83004 90073.

తిరుమల బైపాస్ రోడ్, తిరుపతిలో AC రెస్టారెంట్ నందు పనిచేయుటకు Cashiers, Supervisors, Tea & Coffee Master, South Indian Assistant, Captains, Stewards, Stall Boys, Securitys కావలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత. భోజన సదుపాయం + Non Local కి వసతి సదుపాయం కలదు. ☎ 739659933

రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబికేర్ కొరకు వర్కర్స్ కావలెను. భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ☎ 92814 52828, 92814 52833

మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926.

కస్టమర్స్ కాదు VIP ఇండ్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 13,000-35000/- ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 7993583999.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9848571888 / 9640400073

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
Contact 9705444178 9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాలి.